క్లుప్తంగా

బార్‌ను ఆపాలని వినతి

ఒంగోలు అర్బన్: తమ ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న బార్ అండ్ రెస్టారెంట్‌ను ఆపాలని కోరుతూ స్థానిక 45వ డివిజన్ శ్రీనగర్ జేవియర్‌పేట ప్రజలు నగరపాలక సంస్థ కమిషనర్ వెంకటేశ్వరరావుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఆ రోడ్డు కేవలం 10 అడుగుల వెడల్పే ఉందని, దగ్గరలో సెయింట్ జేవియర్స్ స్కూలు, చర్చి ఉన్నాయని తెలిపారు. అక్కడ బార్ ఏర్పాటు చేస్తే స్థానిక ప్రజలు, మహిళలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని, ప్రజల రాకపోకలకు అంతరాయం కలుగుతుందని వివరించారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు.

20న అభ్యర్థుల ఎంపిక కోసం ప్రవేశ పరీక్ష

ఒంగోలు సిటీ: ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం, విజయవాడ, తిరుపతిలలో ఉచిత రెసిడెన్షియల్ కోచింగ్ ప్రోగ్రాంకు అభ్యర్థుల ఎంపిక కోసం ప్రవేశపరీక్షను ఈ నెల 20వ తేదీ ఆదివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించనున్నట్లు జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమం అండ్ సాధికారిత అధికారి ఎస్.లక్ష్మానాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే అభ్యర్థులకు వ్యక్తిగతంగా మూడు సార్లు ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం అందించారన్నారు. ఆంధ్రప్రదేశ్ స్టడీ సర్కిల్‌లోని బ్రాంచ్‌లలో త్వరలో ప్రారంభం కానున్న సివిల్ సర్వీసెస్, గ్రూప్ 1 అండ్ 2 పరీక్ష కోసం ఉచిత రెసిడెన్షియల్ కోచింగ్ ప్రోగ్రాంకు 11008 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. వీరిలో జిల్లాకు చెందిన 79 మంది తమ హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోలేదని, త్వరగా డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులంతా తమ హాల్ టికెట్లను pstdc.apcfss.in పోర్టల్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. పరీక్ష భౌతిక రీతిలో ఉంటుందన్నారు. ప్రశ్నపత్రం బహుళ ఎంపికలో ఉంటుందని, ఓఎంఆర్ షీట్‌లో సమాధానం ఇవ్వాల్సిన మోడ్. ఇందులో 100 ప్రశ్నలు సమాధానాలు ఉంటాయని తెలిపారు.

22న ఒంగోలులో మినీ జాబ్‌మేళా

ఒంగోలు సిటీ: ఒంగోలులోని కలెక్టరు ఆఫీస్ ఎదురుగా ఉన్న ఓల్డ్‌రిమ్స్ లోని జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈ నెల 22 వ తేదీ మంగళవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు మినీ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఆర్.లోకనాథం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో రిలయన్స్ ట్రెండ్స్ ఒంగోలు, ఇన్నోవ్ సోర్స్ ఎస్బీఐ కార్డ్స్, తిరుమల ఆటోమోటివ్స్ ఒంగోలు, సీఎంఆర్ ఎకో అల్యూమినియం ప్రైవేట్ లిమిటెడ్ తిరుపతి కంపెనీలు వారు ఖాళీలను భర్తీ చేస్తున్నట్లు లోకనాథం తెలిపారు. జిల్లాలోని 18 నుంచి 35 సంవత్సరాల మధ్య పదో తరగతి, ఐటీఐ, ఇంటర్మీడియెట్, డిప్లొమా ఇంటర్మీడియెట్, డిగ్రీ, బీ.టెక్, ఆపై చదువు పూర్తి చేసిన యువతీ యువకులు ఇంటర్వ్యూకు పాన్‌కార్డు, ఆధార్‌కార్డు, సర్టిఫికెట్స్ జిరాక్సు కాపీలతో హాజరు కావాలని తెలిపారు. ఎంపికైన వారికి నెలకు జీతం రూ.10 వేల నుంచి రూ.30 వేల వరకు ఇస్తారన్నారు. నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 78420 04344, లేదా 79892 44381 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఇద్దరు సీఐలకు పోస్టింగులు

ఒంగోలు టౌన్: ఎస్సైల నుంచి ఇటీవల సీఐలుగా పదోన్నతి పొందిన ఇద్దరికి శుక్రవారం పోస్టింగులు కేటాయిస్తూ గుంటూరు రేంజ్ ఐజీ జి.పాల్‌రాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఐటీ కోర్ టీం ఎస్సైగా విధులు నిర్వహిస్తూ సీఐగా పదోన్నతి పొందిన కె.అజయ్‌కుమార్‌కు ఒంగోలు ఎస్సీ, ఎస్టీ సెల్లో పోస్టింగ్ ఇచ్చారు. పొదిలిలో ఎస్సైగా పనిచేస్తూ పదోన్నతి పొందిన కె.మల్లికార్జునరావును ఒంగోలు ట్రాఫిక్‌కు కేటాయించారు.

గెస్ట్ లెక్చరర్ల నియామకానికి నేడు ఇంటర్వ్యూలు

చీమకుర్తి: సంతనూతలపాడు మండలంలోని జిల్లా ట్రిపుల్ ఐటీ కాలేజీలో సివిల్, కంప్యూటర్ సైన్స్, మెకానికల్, యోగా, మ్యూజిక్, డ్యాన్స్ విభాగాలలో గెస్ట్ లెక్చరర్ల నియామకానికి నేడు ఇంటర్వ్యూలు కాలేజీ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.జయరామిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన వారు ఉదయం 9 గంటలకు నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు.

నగరాభివృద్ధిలో రాజీపడేది లేదు



పాత జెడ్పీ కార్యాలయం వద్ద సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి



గుత్తికొండవారిపాలెం డంపింగ్ యార్డులో వ్యర్థపదార్థాలు నిర్మూలించే యంత్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, మేయర్ గంగాడ సుజాత

- ఒంగోలు ప్రజలకు అవసరమైన అన్ని వసతులు కల్పిస్తాం
- పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు అర్బన్: ఒంగోలు నగర అభివృద్ధే లక్ష్యంగా ముమ్మరంగా పనులు చేపట్టామని, వాటిలో కొన్ని పూర్తి కాగా, మరికొన్ని వివిధ దశల్లో ఉన్నాయని స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి తెలిపారు. పనులన్నీ వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. నగరంలో పలు అభివృద్ధి పనులను శుక్రవారం ఆయన ప్రారంభించారు. స్థానిక పాత జెడ్పీ కార్యాలయం వద్ద రూ.40 లక్షలతో విస్తరించిన సిమెంటు రోడ్డును ప్రారంభించారు. ఇస్లాంపేటలో రూ.40 లక్షలతో కమిటీ హాలు నిర్మాణ పనులను ప్రారంభించారు. అక్కడే రూ.16 లక్షలతో పూర్తయిన సీసీ రోడ్డు, రూ.10 లక్షలతో డయాస్‌ను ప్రారంభించారు. అనంతరం కూరగాయల మార్కెట్‌లో రూ.9.5 లక్షలతో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభించారు. కొప్పోలు వద్ద గుత్తికొండవారిపాలెం డంపింగ్ యార్డులో రూ.5.27 కోట్లతో చేపట్టిన బయో వ్యర్థాల నిర్వహణ పనులను బాలినేని ప్రారంభించారు. మరికొన్ని అభివృద్ధి పనులపై నగరపాలకసంస్థ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రజలకు అవసరమైన రోడ్లు, కాలువలు, తాగునీరు, పారిశుధ్యం వంటి మౌలిక వసతులు కల్పించడంలో రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఆయా కార్యక్రమాల్లో నగర మేయర్ గంగాడ సుజాత, ఒుడా చైర్‌పర్సన్ శింగరాజు మీనాకుమారి, ఓఎంసీ కమిషనర్ వెంకటేశ్వరరావు, మున్సిపల్ ఇంజినీర్ మాల్యాద్రి, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు ఈదర సురేష్‌బాబు, షేక్ నూర్జహాన్, బేతంశెట్టి శైలజ, సుధారాణి, ఇతర కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలి

- జిల్లా ఎన్నికల అధికారి, ఎంపీడీవో సుజాత

అల్లూరు (కొత్తపట్నం): పంచాయతీ ఉపఎన్నికల్లో భాగంగా శనివారం జరగనున్న పోలింగ్‌ను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. అల్లూరులో నాలుగో వార్డుకు పోలింగ్ జరగనున్న నేపథ్యంలో పోలింగ్ బూత్‌ను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమై మధ్యాహ్నం 1 గంటకు జరుగుతుందన్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు, అనంతరం గెలుపొందిన అభ్యర్థి ప్రకటన జరుగుతుందన్నారు. ఎన్నికల నిర్వహణకు రిటర్నింగ్ ఆఫీసర్‌గా టి.నాగేష్‌బాబు, జోనల్ ఆఫీసర్‌గా ఏ నాంచార్లరెడ్డిని నియమించారన్నారు. వార్డులో 356 ఓట్లకుగానూ అభ్యర్థులు బెంగుళూరి వేణు, మేక కిరణ్ పోటీపడనున్నారని తెలిపారు. ఎలక్షన్ ఆఫీసర్‌గా వి.చంద్రశేఖర్, ఏపీవోగా జి.చెన్నకేశవరావు, సీహెచ్ కృష్ణప్రసాద్‌ను నియమించినట్లు చెప్పారు. ఓటర్లు సహకరించి ఎటువంటి వివాదాలకు తావులేకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ముందుగా పోలింగ్ సిబ్బందికి ఎన్నికల ఆఫీసర్ సుజాత ఎన్నికలు ఏ విధంగా నిర్వహించాలనే విషయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎన్నికల నియమ నిబంధనలను వివరించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ ఏ బాలచెన్నయ్య, పంచాయతీ కార్యదర్శి ఐపీ రామారావు, మండల పరిషత్ ఏవో నరేంద్రదేవ్, సీనియర్ అసిస్టెంట్ సుదర్శన్‌రావు పాల్గొన్నారు.



అల్లూరులో బ్యాలెట్ బాక్సును పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి సుజాత



చేకూరపాడులో పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న ఈఆర్వో వరకుమార్

పోలింగ్ బూత్‌లలో సౌకర్యాలుండేలా చూడండి...

నాగులుప్పలపాడు: ప్రతి ఒక్క ఓటరు ఓటు హక్కు వినియోగించుకునేలా అన్ని సౌకర్యాలు పోలింగ్ బూత్‌లలో ఉండేలా చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ ఈఆర్వో వరకుమార్ తెలిపారు. శనివారం ఉప ఎన్నికల పోలింగ్ జరగనున్న చేకూరపాడు, మద్దిరాలపాడు, చదలవాడ గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లను శుక్రవారం ఆయన పరిశీలించారు. అక్కడి వసతులపై ఆరా తీశారు. అనంతరం బీఎల్‌వోలు, అధికారులతో ఎన్నికల ప్రక్రియపై మాట్లాడారు. ఆయన వెంట తహసీల్దార్ సుజన్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ జయలక్ష్మి ఉన్నారు.

పోలీసు శాఖకు మంచిపేరు తీసుకురావాలి

- ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు టౌన్: పోలీసు అధికారులు ప్రజలకు మెరుగైన సేవలందించి పోలీసుశాఖకు మంచిపేరు తీసుకురావాలని ఎస్పీ మలికాగర్గ్ పిలుపునిచ్చారు. జిల్లా ఐటీ కోర్ టీంలో ఎస్సైగా విధులు నిర్వర్తిస్తూ సీఐగా పదోన్నతి పొందిన కె.అజయ్‌కుమార్ శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేశారు. ఐటీ కోర్ టీంలో నిబద్ధతతో విధులు నిర్వహించారని అజయ్‌కుమార్‌ను అభినందించారు. సీఐగా ప్రజలకు మరిన్ని సేవలందించాలని సూచించారు. ఎలాంటి రిమార్కులు లేకుండా విధులు నిర్వర్తించాలని కోరారు.

ఎస్పీని కలిసిన తాలూకా సీఐ...

ఒంగోలు తాలూకా సీఐగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పి.భక్తవత్సలరెడ్డి శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ మలికాగర్గ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.



ఎస్పీ మలికాగర్గ్‌కు పూలమొక్క అందజేస్తున్న సీఐ అజయ్‌కుమార్

ఆరోగ్యశ్రీ ద్వారా 3,257 వ్యాధులకు వైద్యం

- ఆరోగ్యశ్రీ రాష్ట్ర స్పెషలాఫీసర్ అశోక్‌బాబు



రోగులకు మందులందిస్తున్న ఆరోగ్యశ్రీ స్పెషలాఫీసర్ అశోక్‌బాబు

చీమకుర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ ద్వారా 3,257 వ్యాధులకు వైద్యం అందిస్తున్నారని ఆరోగ్యశ్రీ రాష్ట్ర స్పెషలాఫీసర్ డాక్టర్ యాదాల అశోక్‌బాబు తెలిపారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌పై ప్రజల్లో ఉన్న స్పందనను పరిశీలించేందుకు సంతనూతలపాడు మండలం చిలకపాడు గ్రామంలో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ గతంలో టీడీపీ కాలంలో కేవలం 1,059 వ్యాధులకు మాత్రమే ఆరోగ్యశ్రీలో చికిత్సకు అవకాశం ఉండేదని తెలిపారు. దానిని ఇప్పుడు మూడు రెట్లకు పెంచడం ద్వారా అనేక మందికి వైద్యసేవలు చేయించుకునే వెసులుబాటు కలిగిందన్నారు. గతంలో పెద్ద పెద్ద కుటుంబాల వారికి మాత్రమే ఫ్యామిలీ డాక్టర్ ఉండేవారని, ఇప్పుడు పేదలకు కూడా ఫ్యామిలీ డాక్టర్ ఉండాలనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ తీసుకొచ్చారన్నారు. అనంతరం ఫ్యామిలీ ఫిజీషియన్ క్యాంప్‌లో రోగులకు మందులు అందించారు.

రక్తహీనతపై అవగాహన కల్పించాలి

- డీఎంఅండ్‌హెచ్ఓ రాజ్యలక్ష్మి

ఒంగోలు అర్బన్: రక్తహీనతపై ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంఅండ్‌హెచ్ఓ రాజ్యలక్ష్మి వైద్యారోగ్య శాఖ ఉద్యోగులకు సూచించారు. రక్తహీనతపై స్థానిక ప్రభుత్వ మెడికల్ కాలేజీలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంఅండ్‌హెచ్ఓ మాట్లాడుతూ పాఠశాలలు, కాలేజీల్లో విద్యార్థులకు రక్తహీనత ఎందుకు ఏర్పడుతోంది, తద్వారా వచ్చే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించడంతో పాటు రక్తహీనతను అధిగమించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహారపు అలవాట్లు, తదితర అంశాలపై క్షుణ్ణంగా తెలియజేయాలన్నారు. అందరం కలిసికట్టుగా పనిచేసి రక్తహీనతను తగ్గించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ సుధాకర్‌బాబు, డాక్టర్ తిరుమలరావు, ఇతర డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



రక్తహీనతపై సమావేశం నిర్వహిస్తున్న డీఎంఅండ్‌హెచ్ఓ రాజ్యలక్ష్మి

హోంగార్డుకు చెక్కు అందజేసిన ఎస్పీ

ఒంగోలు టౌన్: మార్కాపురం సబ్ డివిజన్ పరిధిలో 19 ఏళ్లపాటు హోంగార్డుగా సేవలందించి జూన్‌లో రిటైరైన ఎస్.కృష్ణకు జిల్లాలోని హోంగార్డులంతా కలిసి సేకరించిన ఒకరోజు వేతనం రూ.4.84 లక్షలను శుక్రవారం ఎస్పీ మలికాగర్గ్ చేతుల మీదుగా అందజేశారు. స్థానిక ఎస్పీ చాంబర్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డీపీవో ఏఓ సులోచన, ఆర్ఐ హరిబాబు పాల్గొన్నారు.



కృష్ణకు చెక్కు అందజేస్తున్న ఎస్పీ మలికాగర్గ్

పశుపోషకులు సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలి

కొత్తపట్నం: ప్రభుత్వం నుంచి పశువులకు వచ్చే సబ్సిడీ పథకాలను పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధకశాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ కె.బేబీరాణి సూచించారు. స్థానిక పశువైద్యశాలలో శుక్రవారం పశువిజ్ఞాన బడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం పశుపోషకులకు వివిధ రకాల సబ్సిడీ పథకాలు ప్రవేశపెట్టిందని, వినియోగించుకోవాలని సూచించారు. టీఎంఆర్, గడ్డి విత్తనాలు, డెయిరీ ఫాం పథకాల గురించి వివరించారు. పశువులకు అత్యవసర నిమిత్తం ప్రాణాలు కాపాడుకోవడానికి 1962 అంబులెన్స్‌ను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. వెహికల్‌ను రైతులు వినియోగించుకోవాలని సూచించారు. దూడల మరణాలు ఎక్కువగా ఉన్నాయని, అవి తగ్గించుకోవడానికి సలహాలు తీసుకోవాలని చెప్పారు. సీజన్‌లో వచ్చే వ్యాధులు, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి ఆషా, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న జేడీ బేబీరాణి

'పొన్నూరు'కి ఎస్వీ రంగారావు పురస్కారం

ఒంగోలు మెట్రో: ప్రకాశం జిల్లా రచయితల సంఘం (ప్రరసం) అధ్యక్షుడు పొన్నూరు వెంకట శ్రీనివాసులుకు ఈ నెల 20వ తేదీ విశ్వనట చక్రవర్తి ఎస్వీ రంగారావు పురస్కారం ప్రదానం చేస్తున్నట్లు ప్రరసం ప్రధాన కార్యదర్శి, కోశాధికారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు సాయంత్రం ఆరు గంటలకు స్థానిక సీవీఎస్ రీడింగ్ రూమ్‌లో పద్మశ్రీ ఘంటసాల, మొవ్వ సీతారామయ్య-బసవమ్మ సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సినీ సంగీత విభావరి, ఎస్వీఆర్, ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల్లో పురస్కారం ప్రదానం చేయనున్నట్లు ఆ సంస్థ అధ్యక్షుడు మొవ్వ నాగేశ్వరరావు ప్రకటించారని వారు పేర్కొన్నారు.



పొన్నూరు శ్రీనివాసులు

దివ్యాంగ విద్యార్థులందరికీ మధ్యాహ్న భోజనం

ఒంగోలు సిటీ: భవిత/నాన్‌భవిత కేంద్రాల్లో నమోదైన దివ్యాంగ విద్యార్థులందరికీ మధ్యాహ్న భోజన పథకాన్ని తప్పనిసరిగా అమలు చేయడమే కాకుండా పాఠశాలలోని సాధారణ విద్యార్థులతో పాటు అందజేయాలని సమగ్రశిక్ష ప్రాజెక్టు అదనపు కో ఆర్డినేటర్ వీఎస్ సుబ్బారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 38 భవిత కేంద్రాల ద్వారా దివ్యాంగులకు ఫిజియోథెరపీ సేవలు, రోజువారీ కార్యక్రమాల నిర్వహణ నిమిత్తం అవసరమైన నైపుణ్యాలు తెలియజేయాలని తెలిపారు. ప్రస్తుతం భవిత/నాన్ భవిత కేంద్రాలన్నింటినీ సమీప పాఠశాలలకు తరలించినందున భవిత/నాన్ భవిత కేంద్రాల్లో నమోదైన దివ్యాంగులందరూ ఆయా పాఠశాలల్లో పేర్లు నమోదు చేసుకునే విధంగా హెచ్ఎంలకు సూచనలు జారీ చేయాలని మండల విద్యాశాఖాధికారులను ఆదేశించారు. సహితవిద్య, సమగ్రశిక్ష రాష్ట్ర కార్యాలయం నుంచి ఆ మేరకు ఉత్తర్వులు వెలువడినట్లు సుబ్బారావు తెలిపారు.

ఆర్యవైశ్య నాయకులకు సన్మానం

నాగులుప్పలపాడు: ఆర్యవైశ్య సంఘ జిల్లా అధ్యక్షునిగా ఎంపికైన కొంజేటి సురేష్, మండల అధ్యక్షునిగా ఎంపికైన అమరా వేణులను శుక్రవారం ఉప్పుగుండూరు కార్యాలయంలో సన్మానించారు. పొగాకు బోర్డు సభ్యుడు మారెడ్డి సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు మాదాసు రాంబాబు, శాలివాహన కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ పేరాల చెన్నకేశవులు, పెంట్యాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని లారీడ్రైవర్ మృతి

ఒంగోలు టౌన్: బైకుపై వెళ్తున్న లారీ డ్రైవర్‌ను ట్రాక్టర్ ఢీకొనడంతో మృతిచెందిన సంఘటన స్థానిక మంగమ్మ కాలేజీ సమీపంలో శుక్రవారం జరిగింది. ఒంగోలు పీర్లమాన్యంకు చెందిన షేక్ మహమ్మద్, దొడ్డవరప్పాడు గ్రామానికి చెందిన అనిల్‌కుమార్ లారీ డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. మధ్యాహ్నం మార్టూరులో లారీ బాడుగ ఉందని బుల్లెట్‌పై బయలుదేరారు. మంగమ్మ కాలేజీ దాటిన తర్వాత త్రోవగుంటవైపు వేగంగా వెళ్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి వెనుక నుంచి వీరి బుల్లెట్‌ను ఢీకొట్టింది. దీంతో ఇద్దరూ కిందపడి తీవ్రంగా గాయపడగా ఒంగోలు జీజీహెచ్‌కి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ మహమ్మద్ మృతి చెందగా, అనిల్‌కుమార్ ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు సమాచారం. దీనిపై ఒంగోలు తాలూకా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మెరుగైన ఫలితాలు సాధించాలి



సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

- కేంద్రీయ విద్యాలయాన్ని మరింత అభివృద్ధి చేస్తాం
- వీఎంసీ సమావేశంలో కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: కేంద్రీయ విద్యాలయంలో మరింత మెరుగైన ఫలితాలు సాధించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్, విద్యాలయం మేనేజ్‌మెంట్ కమిటీ (వీఎంసీ) చైర్మన్ ఏఎస్ దినేష్‌కుమార్ తెలిపారు. స్థానిక భాగ్యనగర్‌లోని కేంద్రీయ విద్యాలయంలో వీఎంసీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ కేంద్రీయ విద్యాలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. విద్యాలయంలో అన్నీ సబ్జెక్టులకు కలిపి సగటున 63 మార్కులు సాధిస్తున్నామన్నారు. ఇంగ్లిష్, హిందీ, గణితంలో సగటున 50 శాతం కంటే తక్కువగా ఉందని, వాటిని మెరుగుపరిచేందుకు ఈ విద్యా సంవత్సరంలో ప్రతి సబ్జెక్టులో విద్యార్థులకు కనీసం 60 శాతం మార్కులు సాధించేలా ప్రత్యేక శ్రద్ధ వహించి బోధించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యాలయానికి అవసరమైన ఇతర మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. పాఠశాలకు అవసరమైన కంప్యూటర్లు ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసుల రెడ్డి ఎంపీ నిధులతో సమకూరుస్తామన్నారు. పాఠశాల ప్రాంగణం పక్కనే ఉన్న ఖాళీ స్థలాన్ని విద్యార్థులకు ఆట స్థలంగా కేటాయించేందుకు పరిశీలిస్తామని చెప్పారు. సమావేశంలో ప్రిన్సిపాల్ టీఎస్‌పీ రావు, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ పీ ప్రకాష్‌బాబు, డీఎంహెచ్ఓ రాజ్యలక్ష్మి, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.